

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 13 శుక్రవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 277 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

FRIDAY NOVEMBER 13 2026 | VOL:18 | ISSUE: 277 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

ఆక్రమణల చెర నుంచి తమ్మిడికుంటకు పునర్జీవం.. నగరాభివృద్ధికి కొత్త దిశ

ఆధునికీకరించిన తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి

14 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువు 30 ఎకరాలకు విస్తరణ

చెరువు విస్తరణకు రెండు ఎకరాల స్థలం ఇచ్చిన నటుడు నాగార్జున

చెరువుల పరిరక్షణతో పాటు 'లేక్ ఎకానమీ' అభివృద్ధికి ప్రణాళిక

మూసీ పునరుజ్జీవనంతో నల్లగొండ ప్రజల సమస్యలకు పరిష్కారం



ఇకపై ఐటీ ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోమ్'కు బదులుగా 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అంటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్నటి వరకు శిల్పారామం గురించి మాట్లాడుకున్న నగరవాసులు ఇకపై తమ్మిడికుంట గురించి మాట్లాడుకుంటారని అన్నారు. హైదరాబాద్‌లో ఆధునికీకరించిన తమ్మిడికుంట చెరువును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాత్కాలికంగా కొంతమందికి నష్టం జరిగినప్పటికీ, భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణం, సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే చెరువును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆక్రమణల కారణంగా ఒకప్పుడు 14 ఎకరాలకు కుంచించుకుపోయిన తమ్మిడికుంటను ప్రస్తుతం 30 ఎకరాలకు విస్తరించినట్లు (మిగతా 2వ పేజీలో..)

2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు.. అంతకంటే ముందే వికసిత భారత్: ప్రధాని మోదీ

వికసిత భారత్ లక్ష్యం అందుబాటులోనే ఉందన్న ప్రధాని మోదీ

2047 అనేది డెడ్‌లైన్ కాదు, నిరంతర లక్ష్య సాధన మార్గమని వెల్లడి

దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని మీడియాకు పిలుపు

స్వాతంత్ర్య ఉద్యమంలా చిన్న లక్ష్యాలతోనే పెద్ద గమ్యానికి చేరతామన్న ప్రధాని

'వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర (మిగతా 2వ పేజీలో..)



సీఐఐ సదస్సులో ఏపీపై పారిశ్రామికవేత్తల ప్రశంసల జల్లు.. కియా రూ. 18 వేల కోట్ల పెట్టుబడి ప్రకటన

ఏపీలో రూ. 18 వేల కోట్లతో ప్లాంట్ విస్తరణకు కియా నిర్ణయం

ఇది 'ఈజ్' కాదు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని జీఎంఆర్ ప్రశంస

భోగాపురం విమానాశ్రయం ఏపీకి ఎకనామిక్ ఇంజన్‌గా మారుతుందన్న జీఎం రావు

మహారాష్ట్ర నా జన్మభూమి అయితే, ఏపీ నా భాగ్య భూమి అన్న సాగర్ డిఫెన్స్ సీఈఓ

సీఐఐ సదస్సు వేదికగా ఏపీ ప్రభుత్వ విధానాలపై పారిశ్రామికవేత్తల కితాబు



రూ. 18 వేల కోట్లతో విస్తరణ: కియా ఇండియా

పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకెళ్తున్న తీరుపై పారిశ్రామిక దిగ్గజాలు ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని కొనియాడారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో తమ భవిష్యత్ ప్రణాళికలను, భారీ పెట్టుబడుల వివరాలను ప్రకటించారు. కియా, జీఎంఆర్, సాగర్ డిఫెన్స్ వంటి సంస్థల అధినేతలు ఏపీ ప్రభుత్వ పనితీరును ప్రత్యేకంగా అభినందించారు.

కియా ఇండియా సీఈఓ, ఎండీ గ్వాంగ్ లీ మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విజయానికి ఏపీలోని కియా పరిశ్రమే ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబుపై, ఏపీ ప్రభుత్వంపై ఉన్న పూర్తి భరోసాతోనే మేం భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాం. ప్రస్తుతం ఉన్న ప్లాంట్‌ను విస్తరించి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించాం. ఇందుకోసం రూ. 18 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాం. ఈ విస్తరణ ద్వారా ప్రత్యక్షంగా 12 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి" అని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఏటా 4 లక్షల వాహనాలను ఉత్పత్తి చేస్తూ, ఏపీ ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌కు కియా అండగా నిలుస్తోందని తెలిపారు. ఇక్కడ తయారైన కార్లను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తూ, 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నామని గర్వంగా చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సుస్థిర ఆంధ్రప్రదేశ్ (మిగతా 2వ పేజీలో..)

రిసాల్వెన్ సీఈవో పరాగ్ శర్మతో నారా లోకేశ్ భేటీ.. సీమలో భారీ ప్రాజెక్టుకు ఆహ్వానం

సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పరాగ్ శర్మతో భేటీ అయిన లోకేశ్

రాయలసీమ పునరుత్పాదక ఇంధన జోన్‌లో ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ఆహ్వానం

ప్రాజెక్టుల సకాల అమలుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ

విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ప్రాంగణంలో ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ రిసాల్వెన్ సీఈవో పరాగ్ శర్మతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్వచ్ఛ ఇంధన రంగంలో పెట్టుబడులు, ప్రస్తుతం అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై వీరి మధ్య కీలక చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... 2025 పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న 1 గిగావాట్ ఎంవోయూ నుంచి 180 మెగావాట్ల విండ్ ప్రాజెక్టు వరకు రిసాల్వెన్ సంస్థ రాష్ట్రంలో స్థిరంగా ఎదుగుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల సకాల అమలుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో కూడిన రాయలసీమ పునరుత్పాదక (మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ.. జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం

హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ కేంద్రం ప్రారంభం

మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సరికొత్త కేంద్రం ఏర్పాటు

త్వరలోనే వెయ్యి మంది నిపుణుల స్థాయికి విస్తరణ

ఏఐ క్లౌడ్ ఇంజనీరింగ్‌పై ప్రధాన దృష్టి

హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' (మీఠీం), ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' (+వఅజుఖమ్) భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు.ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత (మిగతా 2వ పేజీలో..)



ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి పొన్నం హెచ్చరిక

ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్న పొన్నం

ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్న మంత్రి

ఉచిత బస్సు వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రకటన

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి నియామక పత్రం



ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడులకు దిగవద్దని ప్రజలకు సూచించారు.ప్రయాణికులకు (మిగతా 2వ పేజీలో..)

తెలంగాణ నుంచి బయల్దేరిన 'కారు' ఢిల్లీకి చేరగానే 'కమలం' పువ్వుగా మారిపోతోంది: సీఎం రేవంత్ రెడ్డి



దేశంలో భారతీయ జనతా పార్టీని (బీజేపీ) సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా, బలం కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన 'జాతీయ విద్యా దినోత్సవం', 'మైనార్టీ సంక్షేమ దినోత్సవం' వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి బీఆర్ఎస్ మిత్రపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ గల్లీల నుంచి బయలుదేరే 'కారు' గుర్తు.. ఢిల్లీ చేరేసరికి బీజేపీ 'కమలం' పువ్వుగా మారిపోతోందని ఆయన చమత్కరించారు. కేంద్రంలో బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం కొనసాగిస్తోందని విమర్శించారు.మైనార్టీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను అడ్డుకోవాలని బీజేపీ చూస్తోందని సీఎం మండిపడ్డారు. పేద మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రద్దు చేయాలని బీజేపీకి ఏ దేవుడు చెప్పాడని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తుచేశారు. మైనార్టీ రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న బీజేపీ.. చేతనైతే ముందుగా ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఆ రిజర్వేషన్లను రద్దు (మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సంపాదకీయం

మారుతున్న కాలం.. మారని మానవ విలువలు!

ఆధునిక సాంకేతికత, మారుతున్న జీవనశైలి మనిషికి ఎన్నో సౌకర్యాలను అందిస్తున్నాయి. కానీ ఈ వేగవంతమైన మార్పుల్లో మానవ సంబంధాలు, ఆప్యాయత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యం తగ్గకూడదు. బిజీ జీవితం పేరుతో కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు కూడా సమయం కేటాయించలేని పరిస్థితులు పెరుగుతున్నాయి.డబ్బు, హోదా, ఆస్తులు జీవితంలో అవసరమే. కానీ కష్టసమయంలో అండగా నిలిచే మనుషులు లేకపోతే వాటికి పూర్తి అర్థం ఉండదు. ఎదుటివారి బాధను అర్థం చేసుకోవడం, అవసరంలో సహాయం చేయడం, పెద్దలను గౌరవించడం, చిన్నవారిని ప్రోత్సహించడం వంటి లక్షణాలే సమాజాన్ని బలంగా నిలబెడతాయి.ముఖ్యంగా పిల్లలకు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వం నేర్పాలి. పోటీ ప్రపంచంలో విజయం సాధించడం ఎంత ముఖ్యమో మంచి మనిషిగా ఎదగడం కూడా అంతే ముఖ్యం.కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి ఒక్కరూ మానవ సంబంధాలకు విలువ ఇవ్వాలి. స్వార్థం, అసూయ, ద్వేషం వంటి భావాలకు దూరంగా ఉండి సహకారం, సానుభూతి, ఐక్యతను పెంపొందించాలి.కాలం మారవచ్చు.. సాంకేతికత మారవచ్చు.. జీవన విధానం మారవచ్చు. కానీ మనిషిని మనిషిగా నిలబెట్టే మానవత్వం మాత్రం ఎప్పటికీ మారకూడదు. అభివృద్ధితో పాటు విలువలను కాపాడుకున్నప్పుడే ఆరోగ్యకరమైన, ఆదర్శవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.

రిసాల్వెన్ సీఈవో పరాగ్ శర్మతో నారా లోకేశ్ భేటీ.. సీమలో భారీ ప్రాజెక్టుకు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి)

ఇంధన జోన్‌లో రౌండ్-ది-క్లాక్ విండ్-సోలార్-బీఈఎస్ఎస్ (బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్) ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని కంపెనీని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 12.62 జీడబ్ల్యూహెచ్ బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాన్ని ఆమోదించిందని, నిర్దేశించుకున్న 25 జీడబ్ల్యూహెచ్ లక్ష్యంలో సగం ఇంకా అందుబాటులో ఉందని వివరించారు. రిసాల్వెన్ సీఈవో పరాగ్ శర్మ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే తమ సంస్థ మూడు ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. గనేకో త్రీ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు 300 మెగావాట్ల విండ్-సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మరోవైపు రూ.980 కోట్ల వ్యయంతో కూడిన 100 మెగావాట్ల విండ్-సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే భూసేకరణ ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. ఏపీలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్రాజెక్టును చేపట్టేందుకు తమ సంస్థ ఎంతో ఆసక్తిగా ఉందని పరాగ్ శర్మ స్పష్టం చేశారు.

సీఐఐ సదస్సులో ఏపీపై పారిశ్రామికవేత్తల ప్రశంసల జల్లు.. కియా రూ. 18 వేల కోట్ల పెట్టుబడి ప్రకటన

మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలోనూ భాగస్వాములమవుతామని ఆయన స్పష్టం చేశారు.

ఇది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్': జీఎంఆర్ గ్రూప్

జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. ఏపీలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మాత్రమే కాదని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నడుస్తోందని ప్రశంసించారు. "ఒక పెట్టుబడిదారుడిగా చెబుతున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. భోగాపురం విమానాశ్రయం భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రధాన ఆర్థిక చోదక శక్తిగా (ఎకనామిక్ ఇంజన్) మారుతుంది. గతంలో మేం శంషాబాద్ విమానాశ్రయం గురించి ఆలోచించి నిర్మించడం వల్లే, ఇప్పుడు అది తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. అదే తరహాలో భోగాపురం ఏపీకి కీలకం కానుంది" అని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు జీఎంఆర్ గ్రూప్ ఒక ఏరోసిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ఏపీ నా భాగ్య భూమి: సాగర్ డిఫెన్స్

సాగర్ డిఫెన్స్ సీఈఓ నికుంజ్ పరాశర్ మాట్లాడుతూ.. "మహారాష్ట్ర నా జన్మభూమి అయితే, ఆంధ్రప్రదేశ్ నా భాగ్య భూమి" అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. మారిటైమ్ టెక్నాలజీ రంగంలో ఐదో పారిశ్రామిక విప్లవం రాబోతోందని సీఎం చంద్రబాబు తరచూ చెబుతుంటారని, ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందని అన్నారు. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. రక్షణ రంగంలో స్థానిక యువతను భాగస్వాములను చేస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం దిశగా తమ సంస్థ ముందుకు వెళుతోందన్నారు. తీరప్రాంత రక్షకులైన మత్స్యకారుల కోసం ఆధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు.

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ.. జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి)

విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

ఆక్రమణల చెర నుంచి తమ్మిడికుంటకు పునర్జీవం.. నగరాభివృద్ధికి కొత్త దిశ

మొదటి పేజీ తరువాయి)

వివరించారు.

చెరువుల ఆక్రమణలతో నగరానికి ముంపు ముప్పు

హైదరాబాద్ నగరాన్ని 'రాక్స్ అండ్ లేక్స్ సిటీ'గా ముఖ్యమంత్రి అభివర్ణించారు. గతంలో నగరంలో 1,372 చెరువులు ఉండేవని, వివిధ కారణాలతో పాటు ఆక్రమణల వల్ల వాటిలో దాదాపు 50 శాతం కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల ఆక్రమణల కారణంగానే కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లపైకి నీరు చేరి, కాలనీలు చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. వందేళ్ల క్రితమే మూసీ వరదల నుంచి నగరాన్ని రక్షించేందుకు నిజాం పాలకులు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. ముచుకుందా నది, మూసా, ఈసా నదుల సంగమంతో మూసీగా రూపాంతరం చెంది నదీ నాగరికతకు కేంద్రంగా మారిందని వివరించారు.

మూసీ పునరుజ్జీవనం ఆగదు

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూసీ నది తీవ్రంగా కలుషితమైందని రేవంత్ రెడ్డి విమర్శించారు. కలుషిత నీటి ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకే మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మూసీకి కేవలం బాహ్య సుందరీకరణ చేయడం కాకుండా, పూర్తిస్థాయి పునరుజ్జీవనం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎవరికీ అన్యాయం లేదా నష్టం జరగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. త్వరలోనే మూసీ పునరుజ్జీవన తొలి దశ పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు.

అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడుకోవాలని, నగరాభివృద్ధి విషయంలో అన్ని రాజకీయ పక్షాలు భేదాభిప్రాయాలను పక్కనపెట్టి కలిసి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధి, చెరువుల పరిరక్షణ వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించారు. నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

'లేక్ ఎకానమీ'కి ప్రోత్సాహం

నగరంలోని చెరువులను పరిరక్షించడంతో పాటు వాటి పరిసర ప్రాంతాల్లో 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. తమ్మిడికుంట ప్రాంగణంలో ప్రజలకు పూర్తి భద్రత కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. చెరువు ఆవరణలో జమ్మి చెట్టును నాటాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు. దసరా వంటి సంప్రదాయ వేడుకలకు చెరువుల ప్రాంగణాలు కేంద్రాలుగా మారితే మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ నుంచి బయల్దేరిన 'కారు' ఢిల్లీకి చేరగానే 'కమలం' పువ్వుగా మారిపోతోంది: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

చేసి చూపించాలని ఆయన సవాల్ విసిరారు. పేదలకు, మైనార్టీలకు ఓటు హక్కు కల్పించి రాజకీయంగా బలోపేతం చేసింది కాంగ్రెస్ పార్టీ అయితే, బీజేపీ మాత్రం వారి హక్కులను కాలరాయాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు.మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని సీఎం చెప్పారు. పాతబస్తీలోని సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాతబస్తీలో మెట్రో రైలు పనులను ప్రభుత్వం శరవేగంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ద్వారా పాతబస్తీకి చారిత్రక పూర్వవైభవాన్ని తీసుకొస్తామని, మూసీ నదీ పరివాహక ప్రాంతంలో 'నైట్ ఎకానమీ'ని అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దేశంలో పారిశ్రామిక శిక్షణ సంస్థలకు (ఐటీఐ) మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాది వేశారని సీఎం గుర్తుచేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) అప్‌గ్రేడ్ చేసిందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత విస్తరిస్తున్న వేళ, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఏఐ రీప్లేస్ చేయలేని 'బ్లూ కాలర్' ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. సరైన నైపుణ్యాలు ఉంటే బ్లూ కాలర్ జాబ్స్ రంగంలో అవకాశాలకు కొరత ఉండదన్నారు. యువతలో నైపుణ్యాలు, క్రీడలను ప్రోత్సహించేందుకే ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'లను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు అందించాలని, విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని పిలుపునిచ్చారు.రాజకీయంగానూ మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. గతంలో గులాం నబీ ఆజాద్ నుంచి షబ్బీర్ అలీ వరకు అనేక మంది నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించామని, ప్రస్తుతం మాజీ క్రికెటర్ మహమ్మద్ అజహరుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడంతో పాటు షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించామని గుర్తుచేశారు. అంతేకాకుండా రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిన బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ వంటి మైనార్టీ క్రీడాకారులకు భారీ నగదు ప్రోత్సాహకాలతో పాటు గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను అందించి గౌరవించిన విషయాన్ని ప్రస్తావించారు. దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ సమగ్ర విద్యా విధాన రూపకల్పనలో ఆజాద్ పాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి పొన్నం హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి)

మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అయితే, ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఆయన కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగ నియామక పత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ ఇప్పటికే పరిహారం అందించాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం ద్వారా సుమారు రూ.కోటి సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించామని చెప్పారు.

2047 వరకు వేచి చూడాల్సిన పనిలేదు.. అంతకంటే ముందే వికసిత భారత్: ప్రధాని మోదీ

హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు" అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. "ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా? గత 12 ఏళ్లలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యూపీఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?" అని ప్రధాని పేర్కొన్నారు.గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. "మిత్రులారా.. 12 ఏళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవారు" అని ఆయన గుర్తుచేసుకున్నారు. పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పును కూడా మోదీ వివరించారు. "ఒకప్పుడు ప్రతి నాయకుడు ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలిస్తామని నినదించేవారు. అది ఒక మంత్రంలా ఉండేది. ప్రతి ఎన్నికలోనూ పేదరికాన్ని పోగొడతామని హామీలు ఇచ్చేవారు. కానీ నేడు, పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు. పేదరికం తగ్గుముఖం పట్టడం మనం చూస్తున్నాం" అని తెలిపారు.వికసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. "సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని పేర్కొన్నారు.భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. "21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ 'ఇండియా స్టోరీ' ఉంది. నా 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది" అని ప్రధాని కోరారు. అనంతరం దీపావళి, నవరాత్రి, ఛఠ్ పూజ పండుగల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

నేడు నల్గొండలో చేయూత పింఛన్ల పంపిణీ





● లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 12 (విజయ కెరటం):

నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్స్‌లో ఈనెల 13న నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ అధికారులతో కలిసి ఏచూరి గార్డెన్స్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నల్గొండ నియోజకవర్గ పరిధిలోని మండలాలు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులందరూ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో తాగునీరు, పారిశుద్ధ్యం, హెల్ప్‌డెస్క్‌లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.మండలాలు, మున్సిపల్ డివిజన్ల వారీగా లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి, పింఛన్లు ఎక్కడ పంపిణీ చేస్తారో సులభంగా తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, భోజన వసతి తదితర సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.పింఛన్ల పంపిణీ సమాచారాన్ని ముందుగానే లబ్ధిదారులకు తెలియజేయాలని, అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పింఛన్లు పంపిణీ చేయకూడదని స్పష్టం చేశారు. అర్హుల జాబితాలను ముందుగానే సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, మంత్రి పీఏ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రైతులు సహకరించాలి





● రీ సర్వే అభ్యంతరాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి -- కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 12 (విజయ కెరటం):

భూముల రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే రైతులందరూ ప్రభుత్వానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. రైతుల మధ్య సమన్వయం ఉంటేనే భూ సమస్యలను త్వరగా పరిష్కరించవచ్చని అన్నారు.గురువారం మునుగోడు మండలం సింగారం గ్రామంలో భూముల రీ సర్వే అనంతరం జారీ చేసిన నోటీసులపై వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామంలో మొత్తం 255 ఖాతాలకు సంబంధించి 417 ల్యాండ్ పార్సెల్ మ్యాపులు (ఎల్‌పీఎంలు) జారీ చేయగా, వాటిపై 59 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే చేపట్టిందని, దీని వల్ల పాత సమస్యలు పరిష్కారం కావాలే తప్ప కొత్త సమస్యలు తలెత్తకూడదని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం భూముల హద్దులు నిర్ణయించి, అర్హులైన వారికి వారి భూములకు సంబంధించిన పట్టాలు అందజేస్తామని తెలిపారు.రైతులు పక్కనున్న భూముల యజమానులతో సామరస్యంగా చర్చించుకొని అనవసర వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో అభ్యంతరాల స్వీకరణకు కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉంటుందని, ఈలోగా సమస్యలను పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. గ్రామంలో మిగిలిన రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామసభలో రైతులు తమ భూముల హద్దులను పట్టాల ప్రకారమే నిర్ణయించాలని కోరారు. అన్నదమ్ముల మధ్య భూ పంపకాల వివాదాలు, భూమి ఉన్నప్పటికీ పట్టాలు లేని సమస్యలు, నక్షా మ్యాపులు, సర్వే మ్యాపుల మధ్య తేడాలు, అసైన్డ్ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివాదాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యకు రీ సర్వే చట్టం ప్రకారం పరిష్కారం ఉంటుందని, నిబంధనల మేరకు రైతుల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, చందూరు ఆర్డీవో శ్రీదేవి, సర్పంచ్ ఆండాలు, తహసీల్దార్, సర్వేయర్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి దూడలే రేపటి పాడి పశువులు





● మేలు జాతి దూడల ప్రదర్శనలో పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్బారాయుడు

నల్లగొండ, నవంబర్ 12 (విజయ కెరటం):

నేటి ఆడదూడలే రేపటి పాడి పశువులని, వాటి పెంపకం, సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు, పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ బి. సుబ్బారాయుడు సూచించారు.నల్లగొండ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ మండలం పానగల్లు గ్రామంలో నిర్వహించిన మేలు జాతి దూడల ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా అధిక సంఖ్యలో ఆడదూడలను పొందవచ్చన్నారు. దూడలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించాలని, ఎదుగుదలకు అవసరమైన కాల్షియం టానిక్‌లు అందించాలని సూచించారు.జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.వి. రమేష్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పచ్చి, ఎండు పశుగ్రాసాన్ని విరివిగా సాగు చేసుకోవాలని సూచించారు. పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంపునకు నాణ్యమైన పశుగ్రాసం, దూడల పెంపకం ఎంతో కీలకమని తెలిపారు.అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, గోపాలమిత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రదర్శనలో 50 ముర్రా జాతి గేదె దూడలు, 10 మేలు జాతి ఆవు దూడలు కలిపి మొత్తం 60 దూడలను ప్రదర్శించారు. పాల్గొన్న అన్ని దూడలకు నట్టల నివారణ మందులు, బలవర్ధక కాల్షియం టానిక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగరాజు, సహాయ సంచాలకులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో ఆర్థిక సమ్మిళిత ప్రత్యేక శిబిరం..
500 మందికి పైగా ఖాతాదారుల హాజరు





నకిరేకల్, నవంబర్ 12 (విజయ కెరటం):

ప్రజలకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సమ్మిళిత పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో నకిరేకల్‌లో గురువారం ప్రత్యేక ఆర్థిక సమ్మిళిత శిబిరాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏసీబీ నకిరేకల్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిబిరంలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాల నివారణ, రీ-కేవైసీ నవీకరణ, బ్యాంకు ఖాతాల్లో నామినీ నమోదు, క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులపై వివరించారు.ఈ కార్యక్రమానికి హైదరాబాద్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఖాతాదారునికి చేరవేయాలని, అన్ని బ్యాంకు శాఖలు విస్తృతంగా అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్థిక సేవలకు సంబంధించిన సమాచారాన్ని బంధువులు, స్నేహితులకు తెలియజేసి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు.ఆర్బీఐ జనరల్ మేనేజర్ ఎం.జి. సుప్రభాత్ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మ్యూల్ ఖాతాల ప్రమాదాలు, రీ-కేవైసీ, నామినీ నమోదు, సైబర్ మోసాలపై ఫిర్యాదు చేసే విధానాలను వివరించారు. ఎస్‌బీఐ నల్గొండ డీజీఎం (బిజినెస్ అండ్ ఆపరేషన్స్) ప్రియబ్రత మిశ్రా మాట్లాడుతూ, ఖాతాదారులు పెండింగ్‌లో ఉన్న రీ-కేవైసీ ప్రక్రియను వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా బుర్రకథ ప్రదర్శన ద్వారా సైబర్ నేరాల నివారణ, బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రాముఖ్యతను కళాకారులు ప్రజలకు వివరించారు. వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పథకాల నమోదు, రీ-కేవైసీ, నామినీ నమోదు తదితర సేవలు అందించారు. ఈ శిబిరానికి 500 మందికి పైగా ఖాతాదారులు హాజరై విశేష స్పందన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ హైదరాబాద్ స్థానిక ప్రధాన కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్లు, నకిరేకల్ మున్సిపల్ కమిషనర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అడవుల రక్షణకు ఉక్కుపాదం!
అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ నవంబర్ 12,(విజయ కెరటం):

అటవీ సంపదను కొల్లగొట్టే అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని, వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు కలిగించే అక్రమ వేటగాళ్ల ఆటలు సాగనివ్వరాదని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. అడవులు ప్రకృతి సంపదకు నిలయాలని, వాటి పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో డీఎఫ్ఓ నిఖితతో కలిసి జిల్లా స్థాయి అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతాల్లో అక్రమ వేట నివారణ, అటవీ భూముల పరిరక్షణ, అటవీ సంపద అక్రమ తరలింపు, ఆక్రమణల నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.అడవులను నరికివేయడం, అటవీ భూములను ఆక్రమించడం, వన్యప్రాణులను వేటాడటం వంటి చర్యలు ప్రకృతి సమతుల్యతకు పెనుముప్పుగా మారుతున్నాయని, ఇలాంటి వాటిని ఉపేక్షించరాదని కలెక్టర్ పేర్కొన్నారు. అటవీ సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యటిస్తూ సమస్యలను గుర్తించాలని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అటవీ శాఖతో పాటు పోలీస్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, బాధ్యతలను ఒకరిపై మరొకరు నెట్టకుండా సమష్టిగా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అటవీ సంపదను కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రకృతిని పరిరక్షించడం సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. అడవుల రక్షణలో అలసత్వానికి తావులేకుండా, వన్యప్రాణుల మనుగడకు భరోసా కల్పించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలోజిల్లా అటవీశాఖ అధికారి (డిఏఫ్ఓ అప్పిలేట్ అథారిటీ): అనూజ్ అగర్వాల్ ఐఏఫ్ఎస్.పరిపాలనా అధికారి (పిఐఓ)మహ్మద్ గౌస్,సాంకేతిక అధికారి (ఏపిఐఓ.(పున్న రాములు,చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సిసిఏఫ్)వరంగల్ సర్కిల్):భీమా నాయక్, సబ్ కలెక్టర్ వై గణేష్,డిఆర్డిఓ ఎం. విజయలక్ష్మి,, ఆర్డిఓ,టి. సుమ – రెవెన్యూ డివిజనల్ అధికారి, తదితర శాఖకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి కమిషన్‌ను ఆశ్రయించాలి





- **మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర సర్వే చేసి నివేదిక ఇవ్వాలి: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్**

నల్గొండ, నవంబర్ 12 (విజయ కెరటం):

షెడ్యూల్డ్ తెగల ప్రజలు తమ హక్కుల సాధన కోసం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించాలని కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్ పిలుపునిచ్చారు. ఎస్టీ కమిషన్ కోర్టు ప్రజల హక్కుల సాధనకు ఒక ఆయుధమని, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే డైరీ నంబర్ కేటాయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.గురువారం దేవరకొండ మండలంలోని వెంకట్ తండా, బొల్లిగుట్ట తండా, కాచారం గ్రామాల్లో ఆయన పర్యటించి గిరిజనుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. మైనింగ్ కార్యకలాపాలు, రహదారులు, విద్యుత్ సౌకర్యం, భూముల పట్టాలు తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.మైనింగ్ కార్యకలాపాలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వర వెంగమాంబ మైనింగ్ కార్యకలాపాలపై ప్రజలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని సూచించారు. మైనింగ్ ప్రభావాలను ఫొటోలు, వీడియోలతో సహా నమోదు చేసి ఐదు రోజుల్లో నివేదిక సమర్పించాలని, సంబంధిత శాఖలు తమ పరిధిలోని అంశాలపై 15 రోజుల్లో సమగ్ర నివేదికలు అందించాలని ఆదేశించారు.మైనింగ్ లీజుల రెన్యువల్ సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారా? గ్రామస్తులకు సమాచారం ఇచ్చారా? అనే అంశాలపై మైనింగ్ యాజమాన్యాలను ప్రశ్నించారు. స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మైనింగ్ యాజమాన్యాలపై ఉందని స్పష్టం చేశారు.గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని సూచించారు. బొల్లిగుట్ట తండాలో అర్హులైన వారికి భూముల పట్టాలు మంజూరు చేయాలని, వారం రోజుల్లోగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూముల సర్వేను సోమవారం నాటికి పూర్తి చేసి అర్హులైన పట్టాదారులు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కాచారం గ్రామంలో మైనింగ్ సమస్యలపై గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడి సమ్మె విరమించాలని కోరారు. ప్రభుత్వపరంగా వారికి అందాల్సిన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గిరిజనులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా కమిషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు వెల్లడించిన సమస్యలను అధికారులు తీవ్రంగా పరిగణించి నిర్ణీత గడువులోగా నివేదికలు సమర్పించడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎన్‌సీఎస్టీ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబు, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఆర్డీఓ వనజారాణి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ రాహుల్, ఎంపీడీఓ పార్వతి, సర్పంచులు భీముడు, బుజ్జి, హరిలాల్, శ్యామలయ్య తదితర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

చెత్త వేరు చేయకుంటే పరిశుభ్రత ఎలా?

- **తడి, పొడి చెత్తపై ప్రజలకు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ సూచన**

వరంగల్ నవంబర్ 12,(విజయ కెరటం):



తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పట్టణ పరిశుభ్రత విషయంలో ప్రజలు నిర్లక్ష్యాన్ని వీడాలని పరకాల పురపాలక సంఘం 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచనల మేరకు గురువారం 19వ



వార్డులో చెత్త సేకరణ వాహనం ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలో చెత్తను వేరు చేయకుండా మున్సిపల్ సిబ్బందిపై బాధ్యత నెట్టడం సరికాదని, చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పడేసి పట్టణాన్ని అపరిశుభ్రంగా మార్చే విధానానికి ప్రజలు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. చెత్త నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం పెద్ద ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. తడి చెత్త, పొడి చెత్తను కలిపి ఇవ్వడం వల్ల చెత్త నిర్వహణ ప్రక్రియ దెబ్బతింటుందని, ఇకనైనా ప్రతి ఇంటి వారు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పరిశుభ్రతపై మాటలు కాకుండా చేతల్లో బాధ్యత చూపించాలని, పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. మన ఇంటి ముందు శుభ్రంగా ఉంటే సరిపోదు.. మన వీధి, మన వార్డు, మన పరకాల పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలని, ప్రజల సహకారంతోనే ఆదర్శ 19వ వార్డును నిర్మిస్తామని కొయ్యడ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యం!

పరకాలలో ఎమ్మెల్సీ ఓటు నమోదు ఉచిత దరఖాస్తుల కార్యక్రమం

పరకాల నవంబర్ 12 విజయ కెరటం:



పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి, నిరుద్యోగ యువత ఆశయాల సాధనకు తెలంగాణ రక్షణ సేన కృషి చేస్తుందని ఆ పార్టీ వరంగల్ జిల్లా జాయింట్ సెక్రటరీ బొచ్చు రాజు స్వేరో అన్నారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు పట్టభద్రుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. గురువారం పరకాల పట్టణంలో బొచ్చు రాజు స్వేరో ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కోసం ఉచిత దరఖాస్తుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొచ్చు రాజు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పోరాడిన నలమాస శ్రీకాంత్ గౌడ్ కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి పీహెచ్‌డీ సాధించారని తెలిపారు. పేదరికం నుంచి ఎదిగిన ఆయనకు విద్యార్థులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన ఉందన్నారు.సామాజిక న్యాయం, బహుజన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శ్రీకాంత్ గౌడ్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలను విస్మరించాయని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అశోక్‌నగర్‌లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి శ్రీకాంత్ గౌడ్ కృషి చేస్తారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బొచ్చు రాజు కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు జలుగురి రమేష్, మంద నరేష్, బొచ్చు రాణి తదితరులు పాల్గొన్నారు.

మణిరత్నం కొత్త చిత్రం 'ఇంజి వెల్లం' విడుదల తేదీ ఖరారు

విజయ్ సేతుపతి, సాయి పల్లవి ప్రధాన పాత్రధారులు

వచ్చే ఏడాది జనవరి 29న ప్రపంచవ్యాప్తంగా విడుదల

సినిమాకు సంగీతం అందిస్తున్న ఏఆర్ రెహమాన్

లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ సంయుక్త నిర్మాణం

ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం 'ఇంజి వెల్లం' విడుదల తేదీ ఖరారైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 29న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ పతాకాలపై మణిరత్నం, సుభాస్కరన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ మేరకు మద్రాస్ టాకీస్ సోషల్ మీడియా వేదికగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ.. "ఈ తేదీని గుర్తుపెట్టుకోండి. జనవరి 29 నుంచి ప్రపంచవ్యాప్తంగా 'ఇంజి వెల్లం' సందడి షురూ" అంటూ పోస్ట్ చేసింది. లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో ఒక ప్రత్యేకమైన వాయిస్ ఓవర్ క్లిప్ ద్వారా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'ఇంజి' (అల్లం) ఎవరు, 'వెల్లం' (బెల్లం) ఎవరు అంటూ విజయ్ సేతుపతి, సాయి పల్లవి మధ్య సాగే సరదా సంభాషణ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.'చెక్క చివంత వానమ్' (నవాబ్) తర్వాత మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి నటిస్తున్న రెండో చిత్రమిది. ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, అవిక్ ముఖోపాధ్యాయ్ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. అగ్ర శ్రేణి నటీనటులు, దిగ్గజ సాంకేతిక నిపుణుల కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్టుపై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



అనిరుధ్-కావ్య పెళ్లిలో రజనీకాంత్ స్టెప్పులు.. గ్రీస్‌లో తలైవా సందడి



75 ఏళ్ల వయసులో 'మనసిలాయో' పాటకు ఉత్సాహంగా స్టెప్పులేసిన సూపర్‌స్టార్

గ్రీస్ దేశంలో అత్యంత వైభవంగా అనిరుధ్-కావ్య వివాహ వేడుక

హాజరైన తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్ మరియు కళానిధి మారన్ కుటుంబం

చెన్నైలో నవంబర్ 21న ఘనంగా వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాట్లు

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. వీరిద్దరి వివాహ వేడుక గ్రీస్ దేశంలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఎంతో వైభవంగా జరిగింది. డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నిర్వహించిన ఈ శుభకార్యానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.ఈ వివాహ వేడుకలో సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనిరుధ్‌కు బంధువైన రజనీకాంత్, కొత్త దంపతులను ఆశీర్వదించడమే కాకుండా వారితో కలిసి ఉత్సాహంగా సందడి చేశారు. తన బ్లాక్‌బస్టర్ హిట్ పాట 'మనసిలాయో'కు అనిరుధ్, కావ్య మారన్‌లతో కలిసి రజనీకాంత్ వేసిన మాస్ స్టెప్పులు వేడుకలో సరికొత్త జోష్ నింపాయి. 75 ఏళ్ల వయసులో కూడా ఆయన తనదైన మార్కు స్టైల్‌తో డ్యాన్స్ చేసి అతిథులను ఆశ్చర్యపరిచారు. ఈ డ్యాన్స్ వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను, నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ వేడుకకు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, కళానిధి మారన్ కుటుంబంతో పాటు ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. విదేశంలో జరిగిన ఈ వివాహం అనంతరం, సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖుల కోసం చెన్నైలో భారీగా వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నవంబర్ 21న ఈ విందు కార్యక్రమం అత్యంత ఘనంగా జరగనుంది.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528